

ఉపాధి హామీ పథకం గురించి కూలీలకు వివరిస్తున్న సభ్యులు

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన కేంద్ర బృందం

కొల్లూరు, జూలై 30 (ఆన్‌లైన్): జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను కేంద్ర బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. మండల పరిధిలోని గాజుల్లంక, పోతార్లంక గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనులను బృంద సభ్యులు కల్నల్ శర్మ, అగర్వాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీల జాబ్ కార్డులు, హాజరు పట్టీలు, పోస్టాఫీసు ఖాతా పుస్తకాలను వారు పరిశీలించారు. బృంద సభ్యులు కూలీలతో మాట్లాడుతూ, ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించడమే పథకం ఉద్దేశ్యమని తెలిపారు. కూలీలకు కేంద్ర ప్రభుత్వం కల్పించిన హక్కును వినియోగించుకోవాలన్నారు. పనికోసం దరఖాస్తు చేసుకుని విధిగా రసీదు పొందాలన్నారు. 15 రోజుల్లో పని చూపించకపోతే నిరుద్యోగ భృతి పొందవచ్చని కూలీలకు తెలిపారు. అనంతరం తపాలా కార్యాలయానికి వెళ్ళి ఉపాధి కూలీల ఖాతాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ పంచాయితీ సర్పంచ్‌లు కూడా బాధ్యత తీసుకుని పథకంపై ప్రతి ఒక్కరికి పూర్తి అవగాహన కల్పించాలని వారికి సూచించారు. పరిశీలనలో ఎంపిడివో ఎ.సుధాకర్, సర్పంచ్‌లు పద్మావతి, సుబ్బారావు, టెక్నికల్ అసిస్టెంట్ జయచంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## వేటపాలెంలో ఉపాధ్యాయులకు సన్మానం

చుండూరు, జూలై 30 (ఆన్‌లైన్): సమర్ధులైన ఉపాధ్యాయులతోనే మెరికలాంటి విద్యార్థులు తయారవుతారని వేటపాలెం గ్రామ సర్పంచ్ కె.చంద్రలీల తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 11 సంవత్సరాల పాటు సేవలందించి బదిలీపై వెళ్తున్న ముగ్గురు ఉపాధ్యాయులకు జరిగిన సత్కార సభకి ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. పదవ తరగతిలో ఇక్కడ విద్యార్థులు జిల్లాలోనే ప్రథమ స్థానం, ఐదుసార్లు మండల స్థాయిలో ప్రథములుగా నిలవటానికి ఉపాధ్యాయుల కృషి ఫలితమేనని పేర్కొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులు కుర్రా శ్రీనివాస్, ఎస్‌వి.నాగమణి, కె.పద్మావతిలను గ్రామస్తులు ఆర్.వెంకటేశ్వరరావు, జాస్తి సాంబశివరావు, విద్యార్థుల తల్లిదండ్రులు సత్కరించారు.



వరి నాట్లు వేస్తున్న మహిళలు, దమ్ము చేస్తున్న ట్రాక్టర్

## ఆటుపోట్ల మధ్య వరినాట్లకు శ్రీకారం

(ఆన్‌లైన్ – కొల్లిపర)

కష్టాన్ని నమ్ముకుని సేద్యం చేస్తున్న రైతులకు ఈ ఏడాది అన్నీ కష్టాలే. రైతులు ఆటుపోట్ల మధ్య వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులు వర్షాలు పడకపోవడంతో ఏమిచేయాలో అర్ధంకాక భగవంతునిపై భారంవేసి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఒకపక్క తీవ్రమైన వర్షాభావ పరిస్థితులకు తోడు అధిక ఉష్ణోగ్రత వేసవికి మించిన గాలులు వీచడంతో రైతులు పోసిన వరినారుమళ్ళు ఎండిపోతున్నాయి. తెగుళ్ళు వ్యాపించి దెబ్బతింటున్నాయి. మరోపక్క ముందుగా పోసిన నారుమళ్ళు నాట్లువేయడానికి రావడంతో వరుణి కరుణా కటాక్షాలు దక్కక పోతాయా.. పంటలు పండక పోతాయా.. అని రైతులు గురువారం దావులూరులో వరి నాట్లకు శ్రీకారం చుట్టారు. అరకొరగా సాగునీరు వస్తున్నప్పటికీ అధిక ఉష్ణోగ్రతల మూలంగా వేసిన నాట్లు కూడా ఎండిపోతాయేమోనని రైతులు అందోళన చెందుతున్నారు.



ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపిపి కేసన రజని

## డాక్టర్‌పై ఎంపిపి ఆగ్రహం

కొల్లిపర, జూలై 30 (ఆన్‌లైన్): ఆస్పత్రి కమిటి నిధుల నుంచి సబ్ సెంటర్లకు అందజేసే సర్వే రిజిష్టర్ల కొనుగోలుకు ఖర్చులు మించి బిల్లులు ఎందుకు పెట్టారని ఎంపిపి కేసన రజని వైద్యాధికారి సుధాకరరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. మండలంలో సబ్ సెంటర్ల కొరకు 70 ఫీల్డ్ సర్వే రిజిష్టర్లను కొనుగోలు చేశారు. వాటి విలువ 4వేల 700 రూపాయలు కాగా 9వేల 100 రూపాయలను బిల్లు ఎందుకు పెట్టారని డాక్టర్‌ను ఎంపిపి నిలదీశారు. దీనీపై డాక్టర్ సమాధానం ఇస్తూ రిజిష్టర్ కొనుగోలులో ఎటువంటి అవకతవకలు జరుగలేదని తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

## ఆటో బోల్తా: ముగ్గురికి గాయాలు

కొల్లూరు, జూలై 30 (ఆన్‌లైన్): ఆటో బోల్తాపడిన సంఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. బుధవారం రాత్రి మండల పరిధిలోని చిలుమూరు లంక నుంచి వేగంగా వస్తున్న ఆటో అదుపు తప్పి ఈపూరులంక వద్ద బోల్తా పడింది.

ప్రమాదంలో ఆటో డ్రైవర్ రమణతో పాటు దానిలో ఉన్న ప్రయాణీకులు చిలుమూరు లంకకు చెందిన ఆకుల నాంచారయ్య, ఈపూరులంకకు చెందిన యడ్లపల్లి జీరా చంద్రరావులు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తెనాలిలోని ఓ వైద్యశాలకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

## సత్యకుమారిని సన్మానించిన ఉపాధ్యాయులు



పదవీ విరమణ చేస్తున్న సత్యకుమారిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వల్లభాపురం (కొల్లిపర), జూలై 30 (ఆన్‌లైన్): 35 సంవత్సరాల నుంచి హిందీ ఉపాధ్యాయురాలుగా పనిచేసి పదవీ విరమణ చేస్తున్న నార్నె సత్యకుమారిని గురువారం వల్లభాపురం హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఎన్.శ్రీరామకృష్ణయ్య మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైనదని అన్నారు. సత్యకుమారి 35 సంవత్సరాలుగా ఉపాధ్యాయురాలుగా పనిచేసి అందరి మన్ననలు పొందారన్నారు. అనేకమంది శిష్యులను తయారుచేసి వారి అభ్యున్నతికి దోహదపడ్డారన్నారు.

కార్యక్రమంలో చక్రాయపాలెం ప్రధానోపాధ్యాయుడు పి.దశరధరామయ్య, ఉపాధ్యాయులు అవుతు సుజాత, పి.నాగప్రసన్న, అన్నపూర్ణ, పి.అనూరాధ, వరలక్ష్మి దేవి, శ్రీలక్ష్మి, సిహెచ్ నాగ రాజేశ్వరరావు, ఎన్.బ్రహ్మేశ్వరరావు, డి.దానియేలు, పి.శ్రీనివాసరావులు సత్యకుమారిని ఘనంగా సన్మానించారు.

## చౌక ధరల దుకాణం డీలర్‌షిప్‌కు దరఖాస్తు

కొల్లూరు, జూలై 30 (ఆన్‌లైన్): మండలంలోని దోనేపూడి గ్రామంలో ఉన్న చౌకధర దుకాణం కోసం దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ కె.దత్తాత్రేయ శర్మ గురువారం తెలిపారు. గ్రామంలో చౌక ధరల దుకాణం నిర్వహిస్తున్న విఎం ప్రసాద్ రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడిందన్నారు. ఆ ఖాళీని పూరించడానికి ఆర్డీవో షేక్ ఇస్మాయిల్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆయన తెలిపారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి 13వ తేదీ వరకు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తారని ఆయన తెలిపారు.



గోదాము నిర్మాణానికి దాత ఇచ్చిన స్థలం

## సేవా దృక్పథంతోనే గోదాం నిర్మాణం

### సర్పంచ్ శ్రీనివాసరావు

కొల్లూరు, జూలై 30 (ఆన్‌లైన్): రైతుల ఉపయోగార్ధం గ్రామీణ ప్రాంతంలో గోదాము నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేస్తున్నట్లు సర్పంచ్ యార్లగడ్డ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. గ్రామీణ ప్రాంత అభివృద్ధి కోసం పరివర్తనా ఫౌండేషన్ నిర్వాహకులు చేస్తున్న కృషిలో భాగంగా మండల పరిధిలోని జువ్వలపాలెం గ్రామంలో 18 లక్షల వ్యయంతో గోదాము నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. లంక గ్రామాల్లో పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులను కనీస ఖర్చుతో రైతులు నిల్వ చేసుకోవడానికి గోదాం నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. వ్యాపార దృష్టితో కాకుండా కేవలం సేవా దృక్పధంతో గోదాం నిర్మాణానికి



ముందుకు రావడంతో మంచి పనికి తాను సహాయ పడాలని ఆలోచించి ఎకరం పొలాన్ని సంస్థకు విరాళంగా ఇచ్చినట్లు ఆయన తెలిపారు. గోదాం నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమానికి లంక గ్రామాల ప్రజలందరూ రావాలని ఆయన ఆకాంక్షించారు.



జడ్‌పి నిధులతో నిర్మించిన డొంకమార్గం

## నాలుగున్నర లక్షలతో డొంక నిర్మాణం

వేమూరు, జూలై 30 (ఆన్‌లైన్): మండలంలోని కుచ్చెళ్ళపాడు–వెల్లబాడు మధ్య మార్గంలో రైతుల సౌకర్యార్ధం జిల్లా పరిషత్ చైర్మన్ కూచిపూడి విజయ డొంక మార్గానికి నిధులు మంజూరు చేశారు. దాదాపు నాలుగున్నర లక్షల రూపాయలతో నిర్మించిన ఈ మార్గం వల్ల నాలుగు గ్రామాల రైతులు తాము పండించిన పంటల రవాణాకు ఎంతో ఉపయోగ పడుతుంది. ఇందుకు శ్రద్ధ చూపిన చైర్మన్‌కు రైతులు కృతజ్ఞతలు తెలుపుతూ, మరింత పటిష్టత కోసం ఎర్రమట్టిని తోలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పూర్తయిన యువశక్తి ఇంటర్వ్యూలు

వేమూరు, జూలై 30 (ఆన్‌లైన్): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో టి.ఉషారాణి అధ్యక్షతన గురువారం రాజీవ్ యువశక్తి ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయిదు జాతీయ బ్యాంకుల పరిధిలో జరగవలసిన యూనిట్‌ల ఎంపికకు వేమూరు సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ హాజరుకాని కారణంగా వాయిదా వేశారు. జంపని కెనరాబ్యాంక్, చదలవాడ సెంట్రల్ బ్యాంక్, చావలి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, పెరవలి ఆంధ్రాబ్యాంక్ మేనేజర్ల సమక్షంలో రాజీవ్ యవశక్తి కింద ఏడు యూనిట్లకు ఎస్‌సి కార్పొరేషన్ కింద 11 యూనిట్లకు, ఎస్‌టిలకు ఐదు యూనిట్లు, బిసిలకు ఒక యూనిట్ ఎంపిక జరిగింది.

కార్యక్రమంలో పరిషత్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ జెజె శ్రీవిద్య స్పెషల్ ఆఫీసర్‌గా పాల్గొన్నారు. స్టెప్ ఆఫీసుకు చెందిన టెక్నికల్ అడ్వయిజర్ విష్ణుమూర్తి బ్యాంకుల మేనేజర్లు, పంచాయతీల కార్యదర్శులు ఈ ఇంటర్వ్యూల కార్యక్రమానికి హాజరయ్యారు. వేమూరు బ్యాంక్ మేనేజర్ హాజరైన తరువాత ఆ బ్యాంక్ పరిధిలోని ఇంటర్వ్యూలను నిర్వహించడం జరుగుతుందని ఎంపిడివో తెలిపారు.